గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు: పీవో

పార్వతీపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి, ఆరు నుంచి 9 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి విద్యార్థులు రాత పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 10లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూజీయూఆర్‌కేయూఎల్ఏఎం. పీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమం లోనే తరగతులు నిర్వహిస్తారని, పి.కోనవలస, కురుపాం, భద్రగిరి, కొమరాడలో ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆదిత్యాయ నమః



సూర్యదేవుడ్ని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- సూర్యపీఠంలో ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 16: జిల్లావాసులు శుక్రవారం రథసప్తమిని ఘనంగా జరుపుకున్నారు. ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. స్వామివారికి ఇష్టమైన క్షీరాన్నం, పంచామృతం, ఇతర వంటకాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. 'ఆరోగ్యాలను కాపాడి.. చల్లగా చూడు తండ్రి' అంటూ వేడుకున్నారు. మరికొందరు ఆలయాలకు వెళ్లి విశేష పూజలు, అర్చనలు చేశారు. మొత్తంగా జిల్లా అంతటా సూర్యనామం మార్మోగింది. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. జిల్లాకేంద్రం శివారులో ఉన్న సూర్యపీఠంలో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు పీఠాధిపతి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో రుత్వికుల వేదమంత్రోశ్చరణల మధ్య ఉషా, పద్మిని ఛాయా సూర్యభగవానునికి సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పించారు. ఉదయం 8 గంటలకు సౌరదీక్షాపరులతో స్వామివారికి క్షీరాభిషేకాలు చేయించారు. జిల్లాలోఏకైక సూర్యభగవానుని ఆలయం కావడంతో ఏటాలానే ఈ సారి కూడా వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంత వాసులు క్యూలైన్లలో నిరీక్షించిన అనంతరం స్వామివారిని దర్శించి పులకించిపోయారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. సహస్రదీపాలంకరణ, ఊంజల్, పూలంగి సేవలను అత్యంత వేడుకగా జరిపారు. అదే ప్రాంగణంలో సూర్య యోగ సెంటర్ నిర్వహకులు మోహన్‌గంతాయత్ ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన యోగ విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయం బయట పూజలు చేసిన అనంతరం ఆదిత్యుడికి నమస్కారాలు

వైసీపీ నేతల అరాచకం

- మా ఎమ్మెల్యేపై అభాండాలు వేస్తావా?
- మమ్మల్ని ఆక్రమణదారులంటావా?
- రెచ్చిపోయిన వైసీపీ కౌన్సిలర్లు, శ్రేణులు
- అర్ధరాత్రి టీడీపీ కౌన్సిలర్ ఇంటి ముందు వీరంగం
- తలుపులు కొడుతూ.. దాడికి యత్నం
- టీడీపీ శ్రేణులు, పోలీసులు చేరుకోవడంతో మెల్లగా జారుకున్న వైనం
- ఖండించిన తెలుగుదేశం పార్టీ నాయకులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నారాయణరావు ఇంటి వద్ద ఉన్న వైసీపీ శ్రేణులు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 16 : పార్వతీపురంలో అధికార పార్టీ ఎమ్మెల్యే భూదందాలు, కబ్జాలపై ప్రశ్నిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్న 8వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణరావుపై గురువారం అర్ధరాత్రి వైసీపీ కౌన్సిలర్లు, శ్రేణులు దాడికి యత్నించారు. ఏకంగా ఆయన ఇంటికి చేరుకుని వీరంగం సృష్టించారు. తలుపులు తట్టి.. దుర్భాషలాడుతూ.. భయాందోళనకు గురిచేశారు. 'బయటికి రా.. నీ అంతు చూస్తాం అంటూ బెదిరించారు.' అయితే ఇంతలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, టీడీపీ నేతలు అక్కడకు చేరుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

జిల్లా కేంద్రంలోని కొత్తవలస, గిజబ కాలనీ, గోపాలపురం వెళ్లేదారిలోని జగనన్న కాలనీల్లో ఎమ్మెల్యే సహకారంతో కొంతమంది కౌన్సిలర్లు గుడి, బడికి సంబంధించిన స్థలాలను కొంత కాలంగా ఆక్రమిస్తున్నారు. యథేచ్ఛగా నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. వాటిపై బహిరంగంగానే కాకుండా పత్రికలు, సోషల్ మీడియా ద్వారా కౌన్సిలర్ నారాయణరావు ప్రజలకు తెలియజేస్తున్నారు. అంతేకాకుండా రెండు రోజుల కిందట పార్వతీపురం మండలం వెంకంపేటలో నిర్వహించిన శంఖరావం సభలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ కూడా పట్టణంలో ఆక్రమణలపై ప్రస్తావించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే కబ్జాలపై ధ్వజమెత్తారు. ఇది ఎమ్మెల్యేతో పాటు ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు మింగుడు పడలేదు. ఇంకేముంది అనుకున్నదే తడువుగా.. గురువారం అర్ధరాత్రి సమయంలో టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణ రావు ఇంటిపై దాడికి యత్నించారు. 7, 9 వార్డులకు చెందిన అధికార పార్టీ కౌన్సిలర్లు ఆనంద్, జయంతితో పాటు కో ఆప్షన్ సభ్యుడు వెంకటరావు, వైసీపీ నాయకులు గాయత్రి, సదానందనం, చిరంజీవి, అశోక్, సంతోష్, వారి అనుచరులు కౌన్సిలర్ నారాయణరావు ఇంటి గేటు, తలుపులు కొడుతూ తిట్ల పురాణం అందుకున్నారు. 'మా ఎమ్మెల్యేపై అభాండాలు వేస్తూ మమ్మల్ని ఆక్రమణదారులంటావా?' అంటూ గట్టిగా కేకలు వేస్తూ.. కౌన్సిలర్ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. నారాయణరావు వెంటనే పట్టణ పోలీసులకు ఫోన్ చేశారు. 'నాపై దాడి జరుగుతుందని, నన్ను, నా కుటుంబాన్ని రక్షించాలి' అని కోరారు. ఆ తర్వాత ఇంటి బయటకు వచ్చిన నారాయణరావుపై వైసీపీ శ్రేణులు విరుచుకుపడ్డారు. చొక్కా పట్టుకుని వాగ్వాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నాయకులు నారాయణరావు నివాసం వద్దకు చేరుకున్నారు. ఇంతలో పట్టణ పోలీసులు కూడా అక్కడకు చేరుకోగానే వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు మెల్లగా జారుకున్నారు. అయితే వైసీపీ నేతల చర్యలను టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. గతంలో కౌన్సిలర్ నారాయణరావుపై మున్సిపల్ కార్యాలయంలోనే వైసీపీ కౌన్సిలర్, అనుచరులు దాడి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా ఆయన ఇంటికి చేరి దాడికి యత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ అరాచక పాలనకు ఇది నిదర్శనమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న 9వ వార్డు కౌన్సిలర్, అనుచరులు

మూల్యం చెల్లించుకోక తప్పదు

వైసీపీ కౌన్సిలర్లతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అర్ధరాత్రి టీడీపీ కౌన్సిలర్ ఇంటికి వెళ్లి దాడికి యత్నించడం తగదు. ఫ్యాక్షనిస్టు రాజకీయాలను ఎమ్మెల్యే ప్రోత్సహించడం విచారకరం. ఆక్రమణలపై నిలదీసే వారిపై దాడులు చేస్తూ ఉంటే ఊరుకునేది లేదు. వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

- డి.జగదీష్, మాజీ ఎమ్మెల్సీ, పార్వతీపురం

అప్రజాస్వామికం..

కబ్జాలు, అక్రమ నిర్మాణాలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతి నిధులపై సమర శంఖం పూరించిన మా పార్టీ వారిపై దాడులకు పాల్పడడం అప్రజాస్వామికం. అర్ధరాత్రి సమయంలో ప్రతిపక్ష కౌన్సిలర్ ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. ఇటువంటి చర్యలకు భయపడేది లేదు. ఈ దౌర్జన్యాలకు ఫుల్‌స్టాప్ పెట్టే రోజులు దగ్గర పడ్డాయి.

- బోనెల విజయచంద్ర, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్వతీపురం

ప్రాణాలు పోయినా సరే..



నా ప్రాణాలు పోయినా సరే వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల కబ్జాలపై ప్రజలకు తెలియజేస్తూ ఉంటా. ఎమ్మెల్యే జోగారావు, మాజీ సైనికులకు ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం చేస్తుంటే.. నేను కబ్జా చేస్తున్నాని అనడం హాస్యాస్పదం. నిజం నిప్పు లాంటిది.. ప్రజలే న్యాయనిర్ణేతలవుతారు.

- బాధిత కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, పార్వతీపురం

ఆదమరిస్తే.. ఆసుపత్రికే..

- అధ్వానంగా అలికాం-బత్తిలి రోడ్డు
- అడుగుకో గుంత
- కొలిక్కిరాని మరమ్మతు పనులు
- తరచూ ప్రమాదాలు
- హడలిపోతున్న వాహనదారులు



బత్తిలి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

భామిని: మండలంలో అలికాం-బత్తిలి రోడ్డు అధ్వానంగా మారింది. దారి పొడవునా భారీ గుంతలు ఏర్పడగా.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బత్తిలి- కొరమ మార్గంలో ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గోతుల్లో వాహనాలు దిగబడి మరమ్మతులకు గురవుతున్నాయి. బత్తిలి, నేరడి బ్యారేజీ, గురండి, బాలేరు, గజపతినగరం గ్రామ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను తప్పించబోయి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇదే సమయంలో బోల్తా పడడం లేదా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీ కొట్టడంతో తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎందరో వాహనదారులు క్షతగాత్రులుగా మారుతున్నారు, మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. రాత్రి వేళల్లో అయితే సరేసరి. వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. ఏ మాత్రం ఆదమరిచినా.. ఇక అంతే సంగతి. నేరుగా ఆసుపత్రికి చేరుకోవాల్సిందే.

నెలలు గడుస్తున్నా..

ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి నెలలు గడుస్తున్నా ఇంకా కొలిక్కి రావడం లేదు. మెటల్‌డెస్ట్ వేసి వాటరింగ్ చేయడం లేదు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము రేగుతోంది. ఈ కారణంగా వెనుక వచ్చే వాహనదారులకు రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభ విస్తున్నాయి. ఇటీవల నతివాడ సమీపంలో గుంతలో దిగి బైక్ బోల్తా పడడంతో పెద్దదిమిలికి చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. నేరడి బ్యారేజ్ సమీపంలో గొయ్యిలో దిగిన కారు అదుపుతప్పి ఎదురుగా వచ్చిన రెండు బైక్‌లను ఢీ కొంది. దీంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. తరచూ ఇలా ప్రమాదాలు సంభవిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోట్ల స్థానికులే చొరవ చూపి రోడ్డుపై ఉన్న గుంతల్లో కర్రలు పాతి వాటికి గుడ్డను చుట్టి ప్రమాద హెచ్చరిక సూచికగా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ముున్ముందు భారీ ప్రమాదాలు సంభవించక ముందే సంబంధిత ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా ప్రాంత వాసులు, వాహనదారులు కోరుతున్నారు.



గజపతినగరం వద్ద రోడ్డుపై ప్రమాద సూచికగా కర్రను పాతిన స్థానికులు

హామీలు నెరవేర్చాల్సిందే..

- కలెక్టరేట్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

బెలగాం, ఫిబ్రవరి 16 : పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చి, తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు , పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద నిరసన తెలిపారు. ఆర్థిక బకాయిలు, పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. సర్కారు స్పందించకుంటే మెరుపు సమ్మె తప్పదని హెచ్చరించారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో సుమారు 500 మంది ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన సీఆర్‌టీలు

- ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన
- డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేస్తే ఉపాధి కోల్పోతామని వెల్లడి
- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- సంఘీభావం తెలిపిన యూటీఎఫ్



మెడకు ఉరితాళ్లు బిగించుకుని ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఆర్‌టీలు

పార్వతీపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా కొన్ని పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సీఆర్‌టీలు డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఉపాధి కోల్పోతామన్నారు. శుక్రవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మెడకు ఉరితాళ్లు బిగించుకుని వినూత్నంగా నిరసన తెలి పారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. 2004 నుంచి పని చేస్తున్న సుమారు 50 మంది స్కూల్ అసిస్టెంట్లు ప్రభుత్వం నిర్ణయం వల్ల ఇంటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై సర్కారు స్పందించాలని నిన దించారు. వారి నిరసనకు యూటీఎఫ్ జిల్లా నేత మురళీమోహన్‌రావు సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 నుంచి పని చేస్తున్న వారికి.. డీఎస్సీ పేరిట ప్రభుత్వం అన్యాయం చేయడం దారుణమన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇదీ పరిస్థితి

పార్వతీపురం ఐటీడీఏలో 2004 నుంచి 330 మంది సీఆర్‌టీలు పనిచేస్తున్నారు. ఎస్‌జీటీలుగా కొంతమంది, స్కూల్ అసిస్టెంట్లుగా మరికొంతమంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్‌జీటీలకు నెలకు రూ.4,500, స్కూల్ అసిస్టెంట్లకు రూ. 5,500 వేతనాలతో పోస్టింగ్‌లు ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి 2019 మధ్యలో మినిమం స్కేల్ వర్తింపజేస్తూ.. వేతనాలు పెంచింది. పీఆర్సీ కలుపుకొని ఎస్‌జీటీలకు రూ.32,500, స్కూల్ అసిస్టెంట్లకు సుమారు రూ. 48 వేల మేర వేతనాలు అందుతున్నాయి. కాగా 2014, జూన్‌కు ముందు సీఆర్‌పీలుగా జాయిన్ అయిన వారిని రెగ్యులర్ చేస్తున్నట్టు ఇటీవల వైసీపీ సర్కారు ప్రకటించింది. దీంతో 118 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులుగా మార నున్నారు. మిగిలిన వారిలో కొంత మంది ఎస్‌జీటీలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా 77 మంది పనిచేస్తున్నారు. అయితే ఇందులో సుమారు 50 పోస్టులు వచ్చే డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయితే వారంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు అన్యాయం చేయవద్దని సీఆర్‌టీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

అన్యాయం చేయొద్దు



స్కూల్ అసిస్టెంట్లుగా దీర్ఘకాలికంగా పనిచేస్తున్న మాకు అన్యాయం చేయొద్దు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయం వల్ల మేము ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేసే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలి.

- ప్రశాంత్, స్కూల్ అసిస్టెంట్, పార్వతీపురం మండలం

ఉపాధి కోల్పోతాం



డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేస్తే మేము ఉపాధి కోల్పోతాం. మా కుటుంబాలు రోడ్డున పడతాయి. మాకు అన్యాయం చేయొద్దు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- ఆరిక వెంకటరావు, స్కూల్ అసిస్టెంట్, పార్వతీపురం మండలం

నిర్లక్ష్య ధోరణి విడనాడాలి

- కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గ్రామీణ భారత్ బంద్
- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు
- ఐక్య కార్యాచరణతో పోరాటం

రైతులు, కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి విడనాడాలని వివిధ సంఘాల నాయకులు, వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో భాగంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ యూనియన్లు, రైతు సంఘం, ఏఐకేఎస్, ఇతర కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు కలిసి ఉద్యమించడం అరుదైన ఘటన అని అన్నారు. కార్పొరేట్ మతోన్మాద విధానాలతో వచ్చిన దుష్ఫలితాలపై ఇప్పటివరకు విడివిడిగా ఉద్యమాలు చేశామని, ఇప్పుడు ఐక్యంగా పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవలింబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య ఉద్యమం చేపట్టామన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో కార్మిక, రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బెలగాం: ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య సంఘాల నేతలు


భామిని: నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం


సాలూరు: నిరసన ర్యాలీ చేస్తున్న సీఐటీయూ శ్రేణులు


కురుపాం: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు


సీతానగరం: రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం


కొమరాడ: అంతర్ రాష్ట్ర రహదారిపై నిరసన తెలుపుతున్న దృశ్యం


సీతంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వ్యక్తిగత విభేదాలు సరికాదు

- టీడీపీ కౌన్సిలర్ నారాయణరావుకు జనసేన నాయకుల పరామర్శ


నారాయణరావును పరామర్శిస్తున్న జనసేన నాయకులు

బెలగాం: రాజకీయ విభేదాలు పార్టీల పరంగా ఉండాలి కానీ, వ్యక్తిగతంగా ఉండకూడదని జనసేన పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన నాయకులు చందక అనిల్, సిరపురపు గౌరీ, రాజాన రాంబాబు తదితరులు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఉన్న కౌన్సిలర్ నారాయణరావును కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ఇంటిని వైసీపీ నాయకులు ముట్టడించడం సరికాదని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

నారాయణరావుపై ఆరోపణలు తగవు

- టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర


నిర్మాణంలో ఉన్న మాజీ సైనికుల భవనం వద్ద మాట్లాడుతున్న విజయచంద్ర

బెలగాం: పార్వతీపురం పట్టణంలో మాజీ సైనికులకు భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్థలం కేటాయించి, ఇప్పుడు ఆ స్థలం మాజీ సైనికుడు, టీడీపీ కౌన్సిలర్ నారాయణరావు ఆక్రమించారనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు నిర్మాణంలో ఉన్న మాజీ సైనికుల భవనం వద్ద ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 15న స్థానిక ఎమ్మెల్యే జోగారావు మాజీ సైనికుల భవనం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించి, ఈ స్థలం మాజీ సైనికుడు, టీడీపీ కౌన్సిలర్ నారాయణరావు ఆక్రమించారని చెప్పారన్నారు. కానీ ఆ స్థలాన్ని మాజీ సైనికుల కోసం కేటాయించింది ఎమ్మెల్యేనని, ఒక వ్యవస్థకు స్థలాన్ని ఇచ్చి ఒక వ్యక్తి ఆక్రమించాడని ఏ విధంగా అంటున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మాజీ సైనికుల భవన నిర్మాణానికి తన వంతు సాయం అందిస్తానని, మీరు కూడా సాయం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలతో మమ్మల్ని ముడిపెట్టొద్దు

టీడీపీ నాయకులతో కలిసి కొంతమంది మాజీ సైనికులు విలేకర్ల సమావే శంలో మాట్లాడారు. రాజకీయాల మధ్యలోకి మమ్మల్ని లాగొద్దని, ఎమ్మెల్యే మంచి మనసుతో స్థలం కేటాయిస్తే నిధులు సమీకరించి నిర్మాణం చేపడుతున్నామని మాజీ సైనికులు తెలిపారు.

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మాతాశిశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణీకి 01244588000 నెంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. గర్భిణుల్లో తలెత్తే సమస్యలు, సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. కెఎంఎ స్టేట్, రీజనల్ ప్రోగ్రాం అధికారులు ఎల్.రాజు, ఆర్.మోహన్‌రావు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డి.భాస్కరరావు, ఈఐవో నారాయణరావు, డీఎంవో టి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టండి

- జిల్లా విద్యా శాఖ ఏడీ దామోధరావు


ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏడీ

కురుపాం: విద్యార్థులకు ఇకపై రుచికమైన, నాణ్యమైన భోజనాలు వండిపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మికి, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జిల్లా విద్యాశాఖ ఏడీ పి.దామోధరరావు ఆదేశించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేదని తల్లిదండ్రులు ఎంఈఓకు, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడం, ఈ విషయం పత్రికలలో రావడంతో డీఈఓ స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడీ దామోధరరావు, ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ జి.శివునాయుడు, యు.నాగేశ్వరరావును ఆదేశించారు. ఈ మేరకు వారు మధ్యాహ్న భోజన పథకం, స్టాక్ పరిశీలించారు. కుళ్లిన, కరిగిపోయిన గుడ్లు సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని భోజన పథకం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, సీఆర్‌పీ నరేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

డ్రై డేపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి

- డీఎంవో జగన్మోహనరావు


కాలువలను పరిశీలిస్తున్న డీఎంవో జగన్మోహనరావు

కొమరాడ: డ్రై డే కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం పరుశురాంపురం గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ఇంటి పరిసరాలు, కాలువల్లో పరిశుభ్రత తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాన్ని ఆయా గ్రామాల ప్రజలకు వివరించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, సెక్రటరీ కె.అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది ప్రమీల, లత, రామకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉండాలి

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం పాలకొండలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాలుగు మండలాల తహసీల్దార్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో వచ్చిన తప్పులను సవరిస్తున్నామని చెప్పారు. మార్చాల్సిన పోలింగ్ కేంద్రాల జాబితాను త్వరితగతిన ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రం మార్చేటప్పుడు సంబంధిత గ్రామంలో రాజకీయ పార్టీలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి తీర్మానం చేసి మాత్రమే మార్చాలని, కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

గరుగుబిల్లి: తమ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నారు. ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ ప్రతినిధుల ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉద్యోగులు.. ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట ర్యాలీ, ధర్నా చేయనున్నారు. 27న చలో విజయవాడకు బయలుదేరనున్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. ● సాలూరు: రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యచరణలో భాగంగా సాలూరు తాలుకా కేంద్రంలో శ్రీరామ థియేటర్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నుంచి ధర్నా నిర్వహిస్తామని సాలూరు జేఏసీ చైర్మన్ ఆకుల ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

20న యువతకు ఉపన్యాస పోటీలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఈనెల 20న యువతకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్ర యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్స్-2024 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 18-25 సంవత్సరాల మధ్య ఉన్న ఉన్న యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ డీఎస్పీ


ఎస్పీకి మొక్కను అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

బెలగాం: ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీగా ఎస్.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ డీఏఆర్‌లో విధులు నిర్వహించి బదిలీపై పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చారు.

సచివాలయం ప్రారంభం

సీతానగరం: తామరఖండి గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని పార్వతీపురం శాసన సభ్యుడు అలజంగి జోగారావు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గౌరి, శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటినాయుడు, మండల వైసీపీ నాయకులు బొంగురాజు, బలగ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించండి

- సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు సుబ్బరావమ్మ
- మూడో రోజుకు చేరిన దీక్ష

బెలగాం: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సీహెచ్‌డబ్ల్యూ)లను ఆశాలుగా గుర్తించి... సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరసన దీక్ష మూడో రోజుకు చేరింది. శుక్రవారం సీహెచ్‌డబ్ల్యూల నిరసనకు సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కె.సుబ్బరావమ్మ మద్దతు తెలిపి, మాట్లాడారు. గిరిజన మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని, ఐటీడీఏ నుంచి రూ.10 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న చేపట్టే మహాధర్నాలో జిల్లాలోని సీహెచ్‌డబ్ల్యూలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌డబ్ల్యూ యూనియన్ నాయకులు మీనాక్షి, పార్వతి, కుసుమ, అప్పలనరసమ్మ, సీఐటీయూ నాయకులు బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని గత మూడు రోజులుగా నిరాహారదీక్ష చేపడుతున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు శుక్రవారం వినూత్నంగా మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర మాట్లాడుతూ ఈనెల 19న ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సీహెచ్‌డబ్ల్యూలు హాజరై జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కాంతారావు, కమ్యూనిటీ హెల్త వర్కర్లు బి.కమల, కె.శ్రీలత, ఎన్.దేవి, ఎస్.కళావతి, కె.కాంతమ్మ, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.


బెలగాం: సీహెచ్‌డబ్ల్యూలను ఉద్దేశించి మాట్లాడుతున్న సుబ్బరావమ్మ


సీతంపేట: మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

కురుపాం రూరల్/ గుమ్మలక్ష్మీపురం: గుంజరాడ గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా... ఇద్దరు గాయపడ్డారు. వివరాలలోకి వెళితే... నీలకంఠాపురం గ్రామానికి చెందిన సీమల జయశంకర్ (46) గుమ్మలక్ష్మీపురం నుంచి స్వగ్రామానికి మోటారు సైకిలుపై బయలుదేరాడు. నీలకంఠాపురం స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న చామంతికి లిఫ్ట్ ఇచ్చాడు. వీరు గుంజరాడ సమీపంలోకి వచ్చేసరికి మొండెంఖల్ నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు మోటారు సైకిలుపై వస్తున్న ఆరిక జయకిరణ్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీమల జయశంకర్, ఆరిక జయకిరణ్, చామంతిలను ప్రథమ చికిత్స కోసం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సీమల జయశంకర్ (46) మరణించారు. గాయపడిన జయకిరణ్, చామంతిలను మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడు సీమల జయశంకర్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నీలకంఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకుపై నుంచి జారిపడి మహిళ..

సీతంపేట: సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మండ గ్రామానికి చెందిన సవర సిరింగమ్మ(35) ప్రమాదశాత్తూ ద్విచక్ర వాహనం నుంచి జారిపడి మృతిచెందింది. కుటుంబ సభ్యులు, సీతంపేట ఎస్‌ఐ జగదీష్‌నాయుడు అందించిన వివరాలు ప్రకారం.. శుక్రవారం ఉదయం సిరింగమ్మ తన భర్త సవర బాలిమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై బ్యాంకు పని మీద సీతంపేట వస్తోంది. తురాయిపువలస వద్దకు వచ్చేసరికి అక్కడ స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమయ్యింది. వెంటనే ఆటోలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రి తరలించారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు..

కొమరాడ: మండలంలోని ఎగువ గంగరేగువలసలో నాగావళి నదిని ఆనుకుని ఉన్న ఓ రియల్ ఎస్టేట్‌లో శుక్రవారం ఒడిశాకు చెందిన కూలీ విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్‌ఐ నీలకంఠం తెలిపారు. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ నిర్మాణ పనుల్లో బోర్డును తయారు చేసి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు తీసుకుని బయలుదేరారు. బోర్డుపై ఉన్న రాడ్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో దానిని పట్టుకొని ఉన్న గురయ్య సుందం బిజలి (36) అక్కడికక్కడే మృతి చెందాడు. అదృష్టవశాత్తూ బైక్ నడుపుతున్న వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నీలకంఠం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించామని తెలిపారు.

డంపింగ్ యార్డును తరలించండి


సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ: పాలకొండలోని డంపింగ్‌యార్డును తక్షణమే తరలించాలని నగర వాసులు డిమండ్ చేశారు. ఈ మేరకు పాలకొండ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక డంపింగ్‌యార్డు ఆవరణలో శుక్రవారం సామూహిక దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం డంపింగ్ యార్డును తరలించాలని కోరారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో చెత్తను తక్షణమే తరలించాలన్నారు. ఈనెల 15న పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో అధికారులు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారి నారాయణరావు

మక్కువ: వన్యప్రా ణులను సంరక్షించుకో వాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీ శాఖ మండల అధికారి కె.నారాయణరావు అన్నారు. మండలంలోని పాయకపాడు, మేలాపువలస, గోచెక్క గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో నిప్పు పెట్టరాదని, అగ్గిపెట్టెలు, సిగరెట్లు తీసుకెళ్లరాదని సూచించారు. అందరూ అడవులను, వన్యప్రాణులను రక్షించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది గణపతి రమణ, సతీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో ఇక్కట్లు


విద్యుత్ లేకపోవడంతో బ్యాంకులో నిరీక్షిస్తున్న ఖాతాదారులు

పాలకొండ: మండ ల కేంద్రమైన పాలకొండ లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు వివిధ బ్యాంకుల లావాదేవీలకు తరలివచ్చారు. విద్యుత్ లేకపోవడం, బ్యాంకుల్లో ఉన్న ఇన్వర్టర్లు పని చేయకపోవడంతో కంప్యూటర్లు ఆగిపోయాయి. ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీవో గౌరీనాథ్

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఏపీవో ఎం.గౌరీనాథ్ అన్నారు. శుక్రవారం ఉల్లిభద్రలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వేతనదారుల సంఖ్య పెంచేలా దృష్టి సారించాలన్నారు. నూతన నిబంధనల మేరకు పనులు నిర్వహించే ప్రాంతాల్లో విధిగా రెండు దఫాలు ఫొటోలు తీయాలన్నారు. మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఈసీ డి.శ్రీనివాసరావు, క్షేత్ర సహాయకులు స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

జోగారావు పేరు రెడ్‌బుక్‌లో ఎక్కించారు

● టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ నాయకులు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు విజయచంద్ర, జగదీష్, చిరంజీవులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమంలో నిజాలు మాట్లాడితే ఎమ్మెల్యే జోగారావు తట్టుకోలేకపోతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆరోపించారు. ఎమ్మెల్యే పేరు లోకేష్ రెడ్‌బుక్‌లో ఎక్కించారని చెప్పారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఆయన అనుచరులు చేస్తున్న ఆక్రమణలు, చెరువుల కబ్జాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో పురపాలక సంఘ సమావేశంలో కౌన్సిలర్ నారాయణరావుపై వైసీపీ కౌన్సిలర్ అనుచరులు, నాయకులు దాడులు చేశారన్నారు. రెండో పర్యాయం కౌన్సిలర్ నారాయణరావు ఇంటిపై గురువారం రాత్రి 10.30 గంటల తర్వాత ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లతో పాటు సుమారు 150 మంది కార్యకర్తలు, నాయకులు వెళ్లి దాడి చేశారని అన్నారు. నారాయణరావుకు ఎమ్మెల్యే వల్ల ప్రాణహాని ఉందని.. ఆయనకు ఏమైనా జరిగితే ఎమ్మెల్యేదే బాధ్యత అని అన్నారు. నారాయణరావును హత్య చేయాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఏమైనా హాని జరిగితే జోగారావుదే బాధ్యత అన్నారు.

ఏదైనా జరిగితే ఎమ్మెల్యేదే బాధ్యత

శుక్రవారం ఉదయం 7.20 గంటలకు ఎమ్మెల్యే జోగారావు తనకు ఫోన్ చేసి బెదిరించారని టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు ఆరోపించారు. తనకు ఏదైనా జరిగితే ఎమ్మెల్యే జోగారావు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఫోన్ వచ్చిన దగ్గర నుంచి తన కుటుంబ సభ్యులు భయపడుతున్నారని.. తాను భయపడే పరిస్థితిలో లేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోను దేవి చంద్రమౌళి, కోలా మధుసూధనరావు, మజ్జి వెంకటేష్, కొత్తాడ శ్రీనివాసరావు, పెంట సత్యం, గురజాన చంద్రమౌళి, బార్నాల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై ప్రచారం


ప్రచారం చేస్తున్న రాజేష్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో టీడీపీ బూత్‌లెవెల్ ఇన్‌చార్జి సొంటేను రాజేష్ గ్రామం లోని ప్రతి ఇంటికి శుక్రవారం వెళ్లి ఆరు గ్యారెంటీల గురించి వివరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు, వర్తకులు, ఉద్యోగులు అన్ని వర్గాల వారిని కలుస్తూ ఆరు గ్యారెంటీ లపై వివరించానని చెప్పారు.

ప్రభుత్వ దుర్మార్గాలను వివరించండి

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి
● పార్టీ శ్రేణులకు సూపర్ సిక్స్ కిట్లు


సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

సాలూరు: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజలకు వివరించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి.. పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాలూరులోని తన నివాసంలో ఆమె టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ కిట్లను పార్టీ శ్రేణులకు అందజేశారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి తమ పార్టీ లక్ష్యాలను ప్రజలకు తెలియజేయాలని.. ప్రభుత్వ దుర్మార్గాలను వివరించాలని శ్రేణులను కోరారు. శంఖారావం సభకు పెద్ద సంఖ్యలో హాజరైన టీడీపీ-జనసేన కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

లోకేశ్ మాటల్లో తప్పేంటి?

టీడీపీ యువ నేత లోకేశ్ నిర్వహించిన శంఖారావంలో ఉప ముఖ్యమం త్రి పీడిక రాజన్నదొరను ఇంకు లేని పెన్ను అన్న మాటల్లో తప్పేంటని ప్రశ్నించారు. ప్రతి చిన్న విషయానికీ చిన్న శ్రీను వద్దకు పంపుతారని తెలిపారు. ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే తనపై కేసు పెట్టుకోండి అంటూ సవాల్ విసిరారు. 'మాట్లాడితే చర్చకు రండి అని పిలుస్తారు. 18 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న మీరు నా ప్రశ్నలకు సమాధానం చెప్పాల'ని డిమాండ్ చేశారు. గిరిజన మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మీరు ఐటీడీఏ సర్వసభ్య సమావేశం ఎన్నిసార్లు నిర్వహించారని ప్రశ్నించారు. గిరిజనుల పిల్లల బడులను మూసేస్తే ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని నిలదీశారు. 18 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న మీరు మన వీధుల్లోకి నీరు వస్తే ఆపలేకపోయారెందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మంత్రి అనుచరులే డబ్బులు వసూలు చేస్తుంటే ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని... త్వరలో బయట పెడతానని అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రికెట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన పాచిపెంట టీంను ఇంటికి పంపిం చేసి.. అర్హత లేని పార్వతీపురం జట్టును ఎందుకు రాష్ట్ర స్థాయికి పంపించారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళావతి వ్యాఖ్యలు సరికావు

● టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ


మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ: ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తనపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ పరిపాలనపై తనకు మాట్లాడేందుకు అర్హత లేదనడం సరికాదన్నారు. రాజాంలో రూ.ఐదు కోట్లతో దొరికింది ఎవరికని ఆయన ప్రశ్నించారు. డబ్బుకు ఆశపడే తత్వం తనది కాదన్నారు. ఎమ్మెల్యే కళావతి ఇంటి పేరు విశ్వాసరాయి షెడ్యూల్ కులాల్లో ఎక్కడా లేదన్నారు. ఒడిశా నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారన్నారు. ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ భూకబ్జాలలో మొదటి స్థానంలో ఉన్నారని ఆయన ఆరోపించారు. పాలకొండ నియోజకవర్గం నాలుగున్న సంవత్సరాలుగా అభివృద్ధి చెందలేదని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, సీనియర్ నాయకులు కిమిడి కాశినాయుడు, వీరఘట్టం మండల ప్రధాన కార్యదర్శి చింతా ఉమ, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుంకరి అనీల్‌దత్, మాజీ కౌన్సిలర్ అంపోలు శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి జాడ శ్రీధర్, సర్పంచ్ శేషపు సుగుణాకరరావు, మాజీ సర్పంచ్ కోట సంగంనాయుడు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మక్కువ: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ సాలూ రు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మక్కువలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో మధ్య తరగతి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణు, మావుడి ప్రసాదరావు, డాక్టర్ మల్లేశ్వరరావు, గౌరీశంకరరావు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయానికి తోడ్పడండి


వేతనదారులతో మాట్లాడుతున్న బీపీ నాయుడు

వీరఘట్టం: టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ నాయకుడు బీపీ నాయుడు పేర్కొన్నారు. నడుకూరు గ్రామంలో పెద్దబట్టి వద్ద ఉపాధి హామీ పథకం కార్మికులను శుక్రవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స పుండరీకం, జాని, నందివాడ పండు, ఉదయాన చరణ్, సురేష్, గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారి

● ఇబ్బందులు పడుతున్న చిట్టిపూడివలస గ్రామస్థులు
● మరమ్మతులు చేపట్టాలని అధికారులకు వేడుకోలు


గోతులమయంగా చిట్టిపుడివలస రహదారి

వీరఘట్టం: మండలంలోని చిట్టిపుడివలస గ్రామానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి గోతులమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయం అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు.

విద్యుత్తు సరఫరా నిలుపుదల

భోగాపురం: మండలంలోని ముక్కాం, సవరవల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తామని విద్యుత్తుశాఖ ఏఈ మస్తాన్‌వల్లి శుక్రవారం తెలిపారు. 33 కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు నిలుపుదల చేస్తా మని సవరవల్లి, ఎ.రాయవలస, గూడెపువలస, దల్లిపేట, భైరెడ్డిపాలెం, రెడ్డికంచే రు, రావాడ, తూడెం, కవులవాడ, అమటాం, ముంజేరు, నందిగాం, రామ చంద్రపేట, గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలగనుందని, దీనికి వినియోగ దారులు సహకరించాలని తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

శృంగవరపుకోట రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మా సొంతింటి కల నిజం చేయండని మండలంలోని వెంకటరమణ పేట, పెద ఖండేపల్లి వాసులు కోరుతున్నారు. మండలంలోని వెంకటర మణపేటలో నివాసానికి అనుకూలం లేని చోట 57మంది ఇళ్ల స్థలా లు కేటాయించా రని, దీనిని స్థానికులు వద్దనడంతో వేరే చోట ఇళ్ల స్థ లాలు ఇస్తామని చెప్పి ఇచ్చిన పట్టాలను తిరిగి స్వాధీనం చేసుకుని లే అవుట్ రద్దుచేశార న్నారు. అనంతరం గ్రామానికి పలుమార్లు వచ్చి న ఎమ్మెల్యే మీకు ఇంటిస్థ లం వేరేచోట చూసేశామని ఇచ్చేస్తామని చె ప్పినా ఇప్పటికీ ఎటువంటి స్థలం ఇవ్వలేదన్నారు. పెదఖండేపల్లిలో ఎందుకూ పనికిరాని చోట 18 మంది పేదలకు ఇళ్లస్థలాలు కేటా యించారని, కొండమెట్టపై ఇస్తే తాము ఎలా కట్టుకోగలం అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రఘురాజు వర్గం ఆత్మీయ సమావేశం

శృంగవరపుకోట రూరల్: ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వర్గం సంతగైరమ్మపేట గ్రామాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మీ వెనుక మేము ఉంటాం అని చెప్పారు. దీనిపై రఘురాజు స్పందిస్తూ నియోజకవర్గంలో ప్రతిగ్రామం సందర్శించి అందరి అభిప్రాయాలు తీసుకుని ముఖ్యమంత్రికి వివరిస్తామని, అప్పటివరకు వేచి ఉండాలని కోరారు.

జాకేరులో పైడితల్లమ్మ తీర్థం


జాకేరులో తప్పెటగుళ్లు ప్రదర్శన

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో గ్రామ ప్రజల ఆరాధ్యదే వతగా వర్ధిల్లుతున్న పైడితల్లమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభ వంగా సాగింది. ఉదయం 5 గంటల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తప్పెడ గుళ్ల బృందం ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన క్రిమినల్ చట్టం సెక్షన్ 106 (1, 2)ని తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) అనుబంధ సంస్థ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోట జంక్షన్ నుంచి గంటస్తంభం మీదుగా ఎన్‌సీఎస్, కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్‌వో అనితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్లను క్రిమినల్ కేసులకు బాధ్యులుగా చేయడం అత్యంత కిరాతకమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డి శంకరరావు, శ్రీనివాస్, కరీం, భాస్కర్, నాగేశ్వరరావు, రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న పూల ధరలు

● నేడు ఉమ్మడి జిల్లాలో వేలాది పెళ్లిళ్లు


పూలు విక్రయిస్తున్న వ్యాపారి

సాలూరు రూరల్: పూల ధరలు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వాటి ధరలు అమాంతంగా పెరిగాయి. ధర ఎంతయినా పెళ్లికి, శుభకార్యానికి అవశ్యం కావడంతో వినియోగదారులు కొనుగోలు చేయకతప్పడం లేదు. కనకాంబరాలు కిలో రూ.3వేలు పైబడి పలుకుతున్నది. కాగడాలు రకం కిలో రూ.1,200 విక్రయిస్తున్నారు. బంతి కిలో రూ.450, చామంతి ఇదే విధంగా విక్రయిస్తున్నారు. గులాబీ లోకల్ రకం వంద రూ.120కు విక్రయిస్తున్నా రు. వివిధ రకాల పూల ధరలు పెరగడంతో ఇటు భక్తులకు ఇబ్బందిగా మారింది. నిత్యావసర సరుకుల ధరలతోనే ఇబ్బంది పడుతున్న జనం పూజకు వినియోగించే పూల ధరలు పెరగడంతో మరింత భారంగా మారింది. స్థానిక పూల వ్యాపారులు రామభద్రపురం, ఆనందపురం తదితర ప్రాంతాల నుంచి అధిక ధరలకు పూలు కొనుగోలు చేసి విక్రయిస్తారు. ఆయా ప్రాంతాల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి తెచ్చిన పూలకు సరైన గిరాకీ లేకుండా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

● మాఘమాసం రావడంతో పెళ్లిళ్లు జోరందుకున్నాయి. ఈనెల 17న మంచి ముహూర్తం ఉండడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేలాది వివాహాలు జరగనున్నట్టు జ్యోతిష్యులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 26 వరకు ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరగనున్నట్టు సాలూరు శారద జ్యోతిషాలయం సిద్ధాంతి తాడి రమణ తెలిపారు.

ఒడిశా

అడవులే మనుగడకు ఆధారం

● జిల్లా అటవీశాఖాధికారి ఒహుల్ సచిన్ అన్నా సాహెబ్


వేదికపై ఒహుల్, సుబుద్ధి, సాహు తదితరులు

రాయగడ: మానవ మనుగడకు అడవులే ఆధారమని, అవి లేకుంటే ప్రాణవాయువు అందక జీవితం అంధకారమవుతుందని జిల్లా అటవీశాఖాధికారి ఒహుల్ సచిన్ అన్నా సాహెబ్ అన్నారు. స్థానిక ఫారెస్ట్ పార్కులో మంటల నుంచి అడవుల రక్షణ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన జిల్లాలోని అడవుల్లో మానవ తప్పిదం కారణంగా అగ్ని రాజుకుంటోందని అన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన మారథాన్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.సుబుద్ధి, సమితి అభివృద్ధి అధికారి అమూల్య కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న వాహన చోదకులు

రాయగడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ చట్టానికి నిరసనగా జిల్లాలోని వాహన చోదకులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. రాయగడ మోటారు కార్మికుల సంఘ అధ్యక్షుడు సునిల్ ఖోరో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈ చట్టం వాహన చోదకుల పాలిట యమపాశమని, వెంటనే దీన్ని ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 106(1) 106(2) చట్టాలను ఎత్తి వేయాలని, సుదూర ప్రాంతాలకు సరుకులు రవాణా చేస్తున్న వాహన చోదకులకు రహదారి పై తాగునీరు, విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాహన చోదకులు పాల్గొన్నారు.

నాలుగు దుకాణాల్లో చోరీ


చోరీకి గురైన మందులషాపు

రాయగడ: కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న రాయగడలో గురువారం రాత్రి వరుసగా నాలుగు దుకాణాల్లో జరిగిన దొంగతనాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. స్థానిక ప్రధాన రహదారి పాతగేటు వద్ద ఉన్న రెండు మెడికల్ స్టోర్‌లతో పాటు మరో రెండు టైల్స్ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. షట్టర్ విరిచి లోపలికి ప్రవేశించి... చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు. పోలీసులు నాలుగు దుకాణాల వద్దకు వెళ్లి యజమానుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఉపాధ్యాయ నాయకులు


ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజాం: సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ విజయవాడలో ఈ నెల 18న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఉపాధ్యాయ సంఘాల నాయకులను ముందస్తుగా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిరసన కార్యక్రమానికి హాజరు కావద్దని ఎస్ఐ రవిశేఖర్ హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. వారిలో శ్రీఖర్, డోల వాసు, కుప్పిలి రమేష్, మొయ్యి శ్రీరాములు తదితరులు ఉన్నారు.

● ఏపీసీపీఎస్ఈ జిల్లా కార్యదర్శి మొయ్యి శ్రీరాములును శుక్రవారం ముందస్తుగా ఇంటివద్దనే పోలీసులు అరెస్టు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన

విజయనగరం దాసన్నపేట: ఉద్యోగుల సమస్య లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరు తూ ఏపీ జేఏసీ విజయనగరం ఆధ్వర్యంలో జల వనరుల శాఖ కా ర్యాలయంలో నిరసన కార్యక్ర మం చేపట్టారు. మ ధ్యా హ్న భోజన విరామ సమయంలో నల్లరిబ్బన్లు ధ రించి...నిరసన తెలి పారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ఉపాధ్యక్షులు డీవీ రమణ, నాయకులు సురేష్, ప్రభూ జీ, ఆనంద కుమార్, రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

'రాజధాని ఫైల్స్'తో జగన్‌లో వణుకు

లక్కవరపుకోట: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పట్టుకుందని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో రాజధాని ఫైల్స్ సినిమా విడుదల కావడంతో జగన్మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని విమర్శలు గుప్పించారు. రాజధాని భూముల విధ్వంసం సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపారని... దీంతో జగన్ బండారం మొత్తం ప్రజలకు తెలిసిపోయిందని చెప్పారు. సినిమా విడుదల కాకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా న్యాయస్థానం అనుమతి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పాతబొబ్బిలిలో కమిషనర్ పర్యటన

బొబ్బిలి: మున్సిపల్ పరిధిలోని పాత బొబ్బిలి గ్రామంలో శుక్రవారం కమిషనర్ లాలం రామలక్ష్మి పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కడా చెత్తా చెదారాలు, మురుగునీరు నిల్వ ఉండరాదని, అలా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాతబొబ్బిలి జంక్షన్ లో గల గ్రంథాలయం నిర్వహణ, దాని పనితీరుపై ఆరా తీశారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీవో

విజయనగరం క్రైం: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్టీవో రమేష్ సూచించారు. శుక్రవారం రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు సీటు బెల్టు ధరించాలని.. లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. జేఎన్‌టీయూలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ ప్రసాద్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖాధికారులు, సిబ్బందితో పాటు వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

'రాజధాని ఫైల్స్' ప్రతిఒక్కరూ వీక్షించాలి

గుమ్మలక్ష్మీపురం: 'రాజధాని ఫైల్స్' సినిమాను ప్రతి ఒక్కరు వీక్షించాలని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారని అన్నారు. రాజధాని రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచ స్థితికి జగన్‌రెడ్డి దిగజారడం సిగ్గు చేటన్నారు. సినిమాను చూసిన ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత వస్తుందని హైకోర్టుకు వెళ్లి ఆపించడం తగదన్నారు. సైకో జగన్ అమరావతి రైతుల ఉసురు పోసుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం.. రాజధాని రైతులను ఆదుకోవడం ఖాయమని చెప్పారు.

పెట్రోల్ బంకు ప్రారంభం

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని సీతంపేట రోడ్డులో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పె ట్రోల్ బంకును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, డీఎస్పీ జి.వి.కృష్ణారావు, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగరాడలో చోరీ

రేగిడి: ఉంగరాడలో ఈనెల 13న బి.నాగరాజు ఇంట్లో చోరీ ఘటన చోటు చేసుకుంది. ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో శ్రీకాకుళంలో గృహ ప్రవేశానికి వెళ్లారు. ఆ సమయంలో చోరీ జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఒక టిన్నర తులాల బంగారం, రూ.30 వేల నగదు పోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం క్లూస్ టీం ఘటనా స్థలాన్ని సందర్శించి.. ఆధారాలు సేకరించింది. ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐ ఎస్.శ్రీనివాస రావు, క్లూస్ టీమ్, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: అవనాం జంక్షన్ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న రావాడ గ్రామానికి చెందిన బత్తుల పైడిరాజును అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. బెల్టు షాపు నిర్వాహ ణ నిమిత్తం మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వ హించి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, పైడిరాజును అరెస్టు చేశామని తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో రామాలయ రెండో వార్షికోత్సవ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో కల్యా ణోత్సవంలో పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని కోటిపల్లి గ్రామ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.